## క్లుప్తంగా

### పర్యావరణ ప్రేమికుడి ఆందోళన



కాజీపేట: ఐదేళ్ల క్రితం హరితహారం కార్యక్రమంలో భాగంగా నాటిన మొక్కలు ఇప్పుడు ఏపుగా పెరిగి చెట్లుగా మారాయి. అయితే, అవి ఇంటికి అడ్డుగా ఉన్నాయనే సాకుతో నరికి వేసిన యజమాని చర్యను నిరసిస్తూ ఆయన ఇంటి ఎదుట పర్యావరణ ప్రేమికుడు మేధిని ప్రకాష్ శనివారం ఆందోళన చేశారు. సేవ్ నేచర్ పేరుతో ఫ్లెక్సీతో నిరసన తెలిపారు. పచ్చని చెట్లను నరికిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ అధికారులను కోరారు.

### ఎన్‌హెచ్‌ఆర్‌సీ సేవా కార్యక్రమాలు



నయీంనగర్: ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఆధ్వర్యంలో అనాథాశ్రమాల్లో అమ్మ ముద్ద, మెడికల్ క్యాంప్, రక్తదాన శిబిరాలు, విపత్తుల సమయంలో ప్రజలకు సహకారం అందిస్తున్నట్లు నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జాతీయ అధ్యక్షుడు పి.సంపత్‌కుమార్ తెలిపారు. హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎన్‌హెచ్‌ఆర్‌సీ ఒక ఎన్‌జీఓ అని అన్నారు. ఎన్‌హెచ్‌ఆర్‌సీ పేరుతో ఫేక్ సంస్థలు రిజిస్టర్ అవుతున్నాయని, వాటి పట్ల జాగ్రత్తగా ఉండాలని కోరారు. కార్యక్రమంలో బుర్ర రమేష్, డి.శ్రీకాంత్, ఆసిఫ్‌పాషా, గంగారాం, శ్యాం సుందర్ తదితరులు పాల్గొన్నారు.

### దెబ్బతిన్న పంటల పరిశీలన



కాజీపేట అర్బన్: ఇటీవల కురిసిన అకాల వర్షానికి కాజీపేట మండలంలోని భట్టుపల్లి, కొత్తపల్లి గ్రామాల్లో నష్టపోయిన పంటలను ఏఈఓ భరత్‌తో కలిసి కాజీపేట మండల రైతుబంధు సమితి కోఆర్డినేటర్ కంకణాల సంపత్‌రెడ్డి శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంపత్‌రెడ్డి మాట్లాడుతూ బాధిత రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. కార్యక్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ ఇనుగాల రజనీరెడ్డి, మణికంఠ రమణారెడ్డి, ప్రసాద్, వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

### టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలి

వరంగల్: టీఎస్‌పీఎస్సీని రద్దు చేయాలని సామాజిక న్యాయ వేదిక వరంగల్ జిల్లా అధ్యక్షుడు సంగ వెంకటరాజం డిమాండ్ చేశారు. కాశిబుగ్గలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పరీక్ష పత్రాల లీకేజీలకు కారణమైన ప్రతీఒక్కరిని కఠినంగా శిక్షించాలని సూచించారు. సామాజిక న్యాయ వేదిక రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు సాంబయ్య యాదవ్, రాష్ట్ర సలహాదారుడు కె.భూపాల్‌రావు మాట్లాడుతూ వచ్చేనెల 5వ తేదీన నగరంలో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా నాయకులు సుధాకర్, అచ్చ వినోద్, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

### పోలీసుల బందోబస్తు



కాజీపేట రూరల్: కాజీపేట జంక్షన్ వద్ద రైల్వే పోలీసులు శనివారం బందోబస్తు నిర్వహించారు. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీపై కేంద్ర ప్రభుత్వం అనర్హత వేటు వేయడాన్ని నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన నిరసన, ధర్నా పిలుపుతో పోలీసులు అప్రమత్తమయ్యారు. రైల్వే స్టేషన్‌లోకి నిరసనకారులు రాకుండా కాజీపేట రైల్వేస్టేషన్ వద్ద కాజీపేట సివిల్ పోలీసులు, జీఆర్పీ పోలీసులు, ఆర్పీఎఫ్ పోలీసులు కాపలా కాశారు.

### ఒలింపియాడ్‌లో విద్యార్థుల ప్రతిభ



ఖిలా వరంగల్: ఇటీవల ఐఎస్‌టీఎస్‌ఓ నిర్వహించిన పోటీ పరీక్షల్లో వరంగల్ శంభునిపేటలోని రెనాల్డ్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. ఈమేరకు వారిని పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ శనివారం అభినందించారు. కార్యక్రమంలో చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య, మహేష్, రామ్, ప్రైమరీ ఇన్‌చార్జ్ కావ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

### ఇద్దరికి తీవ్ర గాయాలు

మామునూరు: వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయి ఆటోరిక్షా బోల్తా పడింది. దాంతో విద్యార్థితోపాటు ఆటో డ్రైవర్‌కు తీవ్రగాయాలయ్యాయి. ఈఘటన శనివారం మధ్యాహ్నం ఖిలా వరంగల్ మండలం వరంగల్ – ఖమ్మం జాతీయ రహదారిపై నాయుడు పెట్రోల్ బంక్ వద్ద జరిగింది. క్షతగాత్రులను స్థానికులు 108 వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఘటన స్థలానికి మామునూరు పోలీసులు చేరుకుని వివరాలు సేకరించారు.

# చిరుధాన్యాలతో రక్తహీనత దూరం



రాంపూర్‌లో మాత్రలు పంపిణీ చేస్తున్న ఏఎన్‌ఎం



అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



సోమిడి పాఠశాలలో ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు

మడికొండ: ప్రతీరోజు చిరుధాన్యాలు తీసుకోవడం ద్వారా రక్తహీనతను నివారించవచ్చని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ రాజ్యలక్ష్మి అన్నారు. పోషణ్ పక్షోత్సవాల్లో భాగంగా శనివారం మడికొండ, రాంపూర్ గ్రామాల్లో చిరుధాన్యాల ఆవశ్యకతపై రాజ్యలక్ష్మి వివరించారు. ప్రతీనిత్యం ఆహారంలో చిరుధాన్యాలు ఉండేలా చూసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్‌ఎం సంగీత, సరస్వతి, అంగన్‌వాడీ టీచర్లు శారద, జ్యోతి, పద్మావతి, సంధ్యారాణి, స్వరూప, వెంకటలక్ష్మి, మల్లీశ్వరి, రజిత, ఆశవర్కర్ రజిత తదితరులు పాల్గొన్నారు.

**హౌజింగ్ బోర్డులో..**

హన్మకొండ: హనుమకొండ హౌజింగ్ బోర్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో కిశోర బాలికలు, తల్లులకు చిరుధాన్యాలపై అవగాహన కల్పించారు. ఇంటిలో తయారు చేసిన పల్లి ముద్దలు, నువ్వుల ముద్దలు, జొన్నరొట్టె, ఉలువచారు, బాలమృతం లాంటివి తీసుకోవాలని అంగన్‌వాడీ టీచర్ సరస్వతి వివరించారు. జంక్‌ఫుడ్‌కు దూరంగా ఉండాలని చెప్పారు. చిరుధాన్యాలతో పోషకాహారం అందుతుందని వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రమాదేవి, సరోజ, ఆశ వర్కర్లు, హెల్పర్స్ పాల్గొన్నారు.

**చిరు ధాన్యాల ప్రయోజనాలపై అవగాహన**

కాజీపేట: పోషణ పక్వాడ సందర్భంగా సోమిడి ప్రభుత్వ పాఠశాల ఆవరణలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించారు. సోమిడి సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి ఆధ్వర్యంలో చిరుధాన్యాల్లో పోషక విలువలపై శనివారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. కిశోర బాలికలతో పాటు గర్భిణులు, బాలింతలు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జి.నెహ్రూ, ఆరోగ్యశాఖ సిబ్బంది లావణ్య, మధున, అంగన్‌వాడీ టీచర్లు కవిత, రజిత, భాగ్యలక్ష్మితో పాటు ఆయాలు పాల్గొన్నారు.

# పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి



ధర్నా చేస్తున్న అసోసియేషన్ నాయకులు

హన్మకొండ: పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలని ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ రాష్ట్ర డిప్యూటీ జనరల్ సెక్రటరీ, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు తూపురాణి సీతారాం డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కులో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీతారాం మాట్లాడుతూ ప్రతీనెల మొదటి తేదీన పెన్షన్ చెల్లించాలని, బకాయి ఉన్న 3 డీఆర్‌లను వెంటనే చెల్లించాలని, పరిమితి లేని వైద్య సౌకర్యం కల్పించాలని, రైలు చార్జీల్లో గతంలో ఇచ్చిన రాయితీలు పునరుద్ధరించాలని డిమాండ్‌చేశారు. ధర్నాలో అసోసియేషన్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు తుమ్మ వీరయ్య, ప్రధాన కార్యదర్శి సముద్రాల లక్ష్మీనారాయణ, హనుమకొండ జిల్లా గౌరవాధ్యక్షుడు పెండ్యాల బ్రహ్మయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి నారాయణగిరి వీరన్న, నాయకులు నన్నపునేని సంజీవరావు, రేబెల్లి వెంకటేశ్వరస్వామి, టి.నిర్మల, టి.నరసింహస్వామి, మేరి, ఎ.విద్యాదేవి, గోపాల్‌రెడ్డి, ఉప్పు సమ్మయ్య, కె.యాదగిరి, రఘుపతి, మల్లిక పాల్గొన్నారు.

# మార్కెట్‌లో పారిశుద్ధ్య టెండర్లు ఖరారు



టెండర్లు నిర్వహిస్తున్న కమిటీ సభ్యులు

వరంగల్: వరంగల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని యార్డులు, మార్కెట్లు, అంతర్గత రహదారులు, టాయిలెట్లను శుభ్రం చేయడం, క్యాంటీన్లు, పాన్‌షాపుల నిర్వహణ కోసం నిర్వహించిన టెండర్లు ప్రశాంతంగా జరిగాయి. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ దిడ్డి భాగ్యలక్ష్మి అధ్యక్షతన శనివారం సాయంత్రం టెండర్లను ఓపెన్ చేశారు. ఇందులో స్టేషనరీ కొనుగోలు కోసం నిర్వహించిన టెండర్లలో కొంత గోల్‌మాల్ జరిగే అవకాశాలున్నాయని గుర్తించిన కమిటీ.. మంగళవారం నాటికి వాయిదా వేసింది. మిగిలిన టెండర్లు ఖరారు అయ్యాయి. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.

## నగరంలో నేడు.. రేపు

**నేడు తెలంగాణ బచావో సదస్సు**

హనుమకొండ: హనుమకొండలో ఈనెల 26వ తేదీన జరగనున్న తెలంగాణ బచావో సదస్సును విజయవంతం చేయాలని సదస్సు నిర్వాహకుడు ప్రొఫెసర్ కూరపాటి వెంకట నారాయణ పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమ ఆకాంక్షలకు వ్యతిరేకంగా రాష్ట్రంలో పాలన కొనసాగుతోందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈక్రమంలో ఆదివారం ఉదయం నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో సదస్సు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. సదస్సుకు హాజరై రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరు మురళి, ప్రొఫెసర్ కోదండరాం, ప్రొఫెసర్ తిరుమలి, విమలక్క, రఘు, కాశీ ప్రసాద్, ప్రొఫెసర్ శ్రీనివాస్ పృథ్వీరాజ్ యాదవ్, జర్నలిస్టు విఠల్ ప్రసంగిస్తారని వివరించారు.

**మెట్టుగుట్టపై బ్రహ్మోత్సవాలు షురూ**

మడికొండ: మడికొండలోని మెట్టు రామలింగేశ్వర స్వామి ఆలయంపై ఉన్న సీతారామచంద్రస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఆదివారం ప్రారంభం కానున్నట్లు ఆలయ ఈఓ శేషుభారతి, చైర్మన్ దువ్వ నవీన్ ఒక ప్రకటనలో తెలిపారు.

**సంకీర్తన విభావరి**

విద్యారణ్యపురి: హనుమకొండలోని శ్రీరాజరాజ నరేంద్రాంధ్ర భాషానిలయంలో ఆదివారం సాయంత్రం మంచిర్యాలకు చెందిన పిస్కా సత్యనారాయణ ఆధ్వర్యంలో సంకీర్తన అధ్యక్షరి విభావరి పేరిట నూతన సాహిత్య కార్యక్రమాన్ని నిర్వహించన్నారు. ఈమేరకు జాతీయ సాహిత్య పరిషత్ హనుమకొండశాఖ ప్రధాన కార్యదర్శి తాడిచర్ల రవి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

**5న చలో ఢిల్లీ**

హన్మకొండ చౌరస్తా: ఏప్రిల్ 5వ తేదీన ఢిల్లీలో జరగనున్న కార్మిక, కర్షక సంఘం యాత్ర, ధర్నాను జయప్రదం చేయాలని హనుమకొండ యునైటెడ్ బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ జిల్లా కమిటీ బాధ్యుడు ఉప్పలయ్య పిలుపునిచ్చారు. హనుమకొండలోని పబ్లిక్‌గార్డెన్, ఏనుగుల గడ్డ, బస్టాండ్, కేయూ జంక్షన్లలోని ఆటో అడ్డాల వద్ద కార్మికుల సమావేశాలను శనివారం నిర్వహించారు.

# న్యాయ పోరాట ఫలితంగానే ఇళ్ల స్థలాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆదినారాయణ

కాశిబుగ్గ: 18 ఏళ్ల న్యాయ పోరాట ఫలితమే 318 మంది ఎంవీఆర్ఎస్ కార్మికులకు ఇళ్ల స్థలాలు రాబోతున్నాయని ఆజంజాహి మిల్స్ మాడిఫైడ్ వలంటరీ రిటైర్డ్ –2002 వర్కర్స్ అసోసియేషన్(ఎంవీఆర్ఎస్) అధ్యక్షుడు ఇప్ప ఆదినారాయణ తెలిపారు. భగత్‌సింగ్‌నగర్‌లోని యూనియన్ కార్యాలయంలో యూనియన్ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 318 మంది కార్మికులకు 200 గజాల చొప్పున అన్ని సౌకర్యాలతో కూడిన స్థలం ఇవ్వాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిందని గుర్తుచేశారు. ఇది కార్మికుల విజయం అని అన్నారు. సమావేశంలో యూనియన్ నాయకులు ప్రభాకర్, సాంబయ్య, నర్సింగం, రాజమౌళి, చంద్రమోహన్, సుధాకర్, గోపి, సాంబమూర్తి, సారంగపాణి, సాహెబ్ హుస్సేన్, దశరథం తదితరులు పాల్గొన్నారు.

# హమాలీల సంక్షేమానికి కృషి చేయాలి



ధర్నా చేస్తున్న ఇరు జిల్లాల హమాలీలు

హన్మకొండ: హమాలీలకు ప్రత్యేకంగా సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ హనుమకొండ జిల్లా కార్యదర్శి రాగుల రమేష్, వరంగల్ జిల్లా అధ్యక్షుడు ఎం.సాగర్ డిమాండ్ చేశారు. హనుమకొండ బాలసముద్రంలోని ఏకశిల పార్కు వద్ద హమాలీ వర్కర్స్ ఫెడరేషన్ వరంగల్, హనుమకొండ జిల్లా కమిటీల ఆధ్వర్యంలో హమాలీలు శనివారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా రాగుల రమేష్, ఎం.సాగర్, ఆల్ హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అక్కినపల్లి యాదగిరి మాట్లాడుతూ 55 ఏళ్ల వయసు పైబడిన హమాలీలకు నెలకు రూ.6 వేల చొప్పున పెన్షన్ ఇవ్వాలని, హమాలీలందరికి పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని సూచించారు.

# తెలుగు భాషను కాపాడుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న అయిలయ్య

విద్యారణ్యపురి: తెలుగు భాషను కాపాడుకోవాల్సిన బాధ్యత భాషా పండితులపై ఉందని హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ బన్న అయిలయ్య గుర్తుచేశారు. భాషోపాధ్యాయ సంస్థ (ఎస్ఎల్‌టీఏ టీఎస్) ఆధ్వర్యంలో హనుమకొండలోని సాయిబాబా మందిరంలో శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను శనివారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని భాషా పండితుల్లో ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త, ప్రొఫెసర్ రామచంద్రమౌళి, ఎస్ఎల్‌టీఏ హనుమకొండ అధ్యక్షుడు పోలోజు శ్రీహరి, ఏఎంఓ సారయ్య, ఎస్ఎల్‌టీఏ రాష్ట్ర అధ్యక్షుడు చక్రవర్తుల శ్రీనివాస్, గౌరవ అధ్యక్షుడు పెండ్యాల బ్రహ్మయ్య, జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత వల్లంపట్ల నాగేశ్వర్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సీ వర్గీకరణ బిల్లు పెట్టకుండా మోసం

హన్మకొండ: ఎస్సీ వర్గీకరణకు అన్ని రాష్ట్రాలు అనుకూలంగా ఉన్నా వర్గీకరణకు చట్టబద్ధత కల్పించే బిల్లును పార్లమెంట్‌లో ప్రవేశపెట్టకుండా మాదిగలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మోసం చేస్తోందని మహాజన సోషలిస్టు పార్టీ ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జ్ మంద కుమార్ మాదిగ అన్నారు. హనుమకొండ నక్కలగుట్టలోని హరిత కాకతీయ హోటల్‌లో ఎమ్మార్పీఎస్, ఎంఎస్పీ ముఖ్య నాయకుల సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా మంద కుమార్ మాదిగ మాట్లాడుతూ ఈనెల 31న కలెక్టరేట్ ముట్టడి చేపట్టినట్లు తెలిపారు. సమావేశంలో నాయకులు జన్ను దినేష్ మాదిగ, గద్దల సుకుమార్ మాదిగ, రాజరపు భిక్షపతి మాదిగ, నమిండ్ల సూర్యం మాదిగ, బొడ్డు శాంతిసాగర్ మాదిగ, గోవిందు రవికుమార్ మాదిగ, బోడ సాంబయ్య మాదిగ, వస్కుల ప్రణయ్ మాదిగ, కొట్టే కళ్యాణ్ మాదిగ, మంద వీర స్వామి మాదిగ, చిలుక రాజు మాదిగ పాల్గొన్నారు.

**చలో ఢిల్లీని విజయవంతం చేయాలి**

కాశిబుగ్గ: ఎస్సీ వర్గీకరణ చేయాలంటూ ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఏప్రిల్ 4, 5 తేదీల్లో చేపట్టిన ఛలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాదిగ రాజకీయ పోరాట సమితి (ఎమ్మార్పీఎస్) తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బొక్కల వెంకటస్వామి పిలుపునిచ్చారు. ఈమేరకు కాశిబుగ్గ జంక్షన్‌లో చలో ఢిల్లీకి సంబంధించిన కరపత్రాలను శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు సింగారపు చిరంజీవి, ఇల్లందుల సుధాకర్, జెర్రిపోతుల విల్సన్, కోట శ్యామ్, కొమురయ్య, ప్రభాకర్, బాబురావు, రమేష్ పాల్గొన్నారు.

# విద్య, వైద్యానికి ప్రభుత్వం పెద్దపీట



అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

మడికొండ: విద్య, వైద్యానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ అన్నారు. కాజీపేట మండలం మడికొండ ప్రాథమిక పాఠశాలలో మన బస్తీ – మన బడి కార్యక్రమంలో భాగంగా రూ.50 లక్షల 74వేల వ్యయంతో కల్పించిన మౌలిక వసతులతో పాటు నూతనంగా నిర్మించిన క్లాస్ రూమ్‌లను ఎమ్మెల్యే శనివారం ప్రారంభించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం మల్లారెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో 46వ డివిజన్ కార్పొరేటర్ మునిగాల సరోజన, దర్గా సొసైటీ చైర్మన్ ఊకంటి వనంరెడ్డి, పాఠశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**44వ డివిజన్‌లో..**

కాజీపేట అర్బన్: 44వ డివిజన్ పరిధిలోని కడిపికొండలోని ప్రైమరీ స్కూల్‌లో మన బస్తీ – మన బడి కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్ శనివారం హాజరయ్యారు. ప్రైమరీ పాఠశాలలో రూ.34లక్షల వ్యయంతో చేపట్టిన మౌలిక వసతులు, అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటించారు.

# 'బీజేపీకి రాహుల్‌గాంధీ అంటే భయం'

కాశిబుగ్గ: బీజేపీకి, ప్రధాని మోదీకి కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ అంటే భయం పట్టుకుందని, అందుకే ఆయనపై రాజకీయ కుట్రలు పన్నుతున్నారని టీపీసీసీ కార్యదర్శి మీసాల ప్రకాశ్ ఆరోపించారు. రాహుల్‌గాంధీపై అనర్హత వేటుకు వ్యతిరేకంగా వెంకట్రామ జంక్షన్‌లో ప్రధాని మోదీ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేసి శనివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కూచన రవిందర్, సందెల లాజర్, జంగం రజిత, ఎర్రం కమల్, నర్మెట చిన్నా, సదానందం, యాకుబ్, విష్ణు, అనంతరావు, చంద్రమౌళి, సులోచన, సురేఖ, జహీరా పాల్గొన్నారు.

**యువజన కాంగ్రెస్ ధర్నా**

హన్మకొండ చౌరస్తా: ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీపై తప్పుడు సాక్ష్యాలు సృష్టించి, జైలుశిక్ష పడేలా కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం వ్యవహరించిందని ఆరోపిస్తూ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో శనివారం ధర్నా నిర్వహించారు. హనుమకొండ లష్కర్‌బజార్‌లోని చింతల్ బుక్‌స్టాల్ జంక్షన్ వద్ద చేపట్టిన ధర్నాను ఉద్దేశించి యువజన కాంగ్రెస్ అర్బన్ అధ్యక్షుడు రేపల్లె రంగనాథ్ మాట్లాడారు. రోడ్డుపై బైటాయించి రాస్తారోకో చేస్తున్న యువజన కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌కు తరలించారు. కార్యక్రమంలో యువజన కాంగ్రెస్ వరంగల్ పశ్చిమ నియోజకవర్గ అధ్యక్షుడు కొడిపాక గణేష్, చిదురాల సురేష్, బొక్కల ప్రమోద్, ప్రవీణ్, షేక్‌హసన్, అఖిల్, వీరగంటి సంజయ్, బన్నీ, సాయిరాజ్, చందు పాల్గొన్నారు.

## సంక్షిప్తంగా

**విద్యార్థుల గైర్హాజరు**

విద్యారణ్యపురి/కాశోజీసెంటర్ : హనుమకొండ జిల్లాలో శనివారం నిర్వహించిన ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో 697మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్ ఒకేషనల్ కోర్సులు కలిపి 19,456మందికిగాను 18,759మంది విద్యార్థులు హాజరయ్యారని డీఐఈఓ గోపాల్ తెలిపారు. అదే విధంగా వరంగల్ జిల్లాలో 7,362 మందికి 6,876 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారని డీఐఈఓ మాధవరావు తెలిపారు.

**నీటిని పొదుపుగా వాడుకోవాలి**

వరంగల్ అర్బన్: శరవేగంగా జరుగుతున్న నగరీకరణతోపాటు అంతకంటే వేగంగా తాగునీటి కష్టాలు ఎదురయ్యే ప్రమాదం పొంచి ఉందని, పొదుపుగా వాడుకోవాలని రిటైర్డ్ సూపరింటెండెంట్ ఇంజినీర్ (ఎస్ఈ) పోకల చందర్ సూచించారు. ప్రపంచ నీటి దినోత్సవం సందర్భంగా ఇనిస్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ (ఇండియా), బల్దియా సంయుక్తంగా గ్రేటర్ వరంగల్ ప్రధాన కార్యాలయం కౌన్సిల్ హాల్‌లో 'మీరు ప్రపంచంలో మార్పు' అనే అంశంపై శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'సుస్థిర అభివృద్ధి లక్ష్యంగా 2030వ సంవత్సరం నాటికి అందరికీ నీరు, పారిశుద్ధ్యం కల్పించాల్సిన అవసరం ఉందని గుర్తుచేశారు.

**మైనార్టీల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం**

హన్మకొండ: మైనార్టీల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పాటుపడుతోందని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ అన్నారు. హనుమకొండ సుబేదారి చోటా మసీదు వద్ద ఇత్తెహాద్ ఉల్ ముసల్మాన్ డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిరుపేద మైనార్టీ డ్రైవర్లకు శనివారం నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. నీలం సుహాస్, రఫీక్, అన్సార్, జాఫర్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

**తొలిమెట్టు అమలుపై రిసోర్స్ పర్సన్ల ఆరా**

విద్యారణ్యపురి: హనుమకొండలోని జులైవాడలోని ప్రభుత్వ హైస్కూల్‌ను రాష్ట్ర రిసోర్స్ పర్సన్ సీహెచ్ రాములు, డీఆర్‌పీ పవన్‌కుమార్, రఘుపతి శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా తొలిమెట్టు అమలు తీరు, విద్యార్థుల్లోని సామర్థ్యాలను తెలుసుకున్నారు.

**హోంశాఖ మంత్రిని కలిసిన సీపీ**

కాజీపేట: జయశంకర్‌సార్ భూపాలపల్లి జిల్లా పర్యటనకు విచ్చేసిన రాష్ట్ర హోంశాఖమంత్రి మహమూద్ అలీని హనుమకొండలోని పోలీస్ గెస్టుహౌస్‌లో సీపీ ఏవీ.రంగనాథ్ శనివారం కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం అందించారు.

**అలంకరణ తయారీ శిక్షణతో ఉపాధి**

రామన్నపేట: గృహ అలంకరణ తయారీ శిక్షణతో స్వయం ఉపాధి పొందవచ్చని 22వ డివిజన్ కార్పొరేటర్ బస్వరాజు కుమార్ అన్నారు. పోచమ్మమైదాన్ కమిటీ హాల్‌లో గృహ అలంకరణ తయారీపై శిక్షణ ముగింపు కార్యక్రమం శనివారం జరిగింది.

**సంక్షేమానికి ప్రాధాన్యం**

హసన్‌పర్తి: సంక్షేమానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని పీఏసీఎస్ చైర్మన్ చల్లా గోపాల్‌రెడ్డి అన్నారు. నగరంలోని ఒకటోవ డివిజన్ పలివేల్పులకు చెందిన దేవరకొండ వినయ్‌వర్ధన్‌కు రూ.39 వేల ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కును శనివారం అందించారు.

**క్రీడాపోటీలను విజయవంతం చేయాలి**

ఖిలా వరంగల్: మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆదివారం నుంచి వరంగల్ 33వ డివిజన్ శాంతినగర్‌లో మహిళలకు నిర్వహించనున్న క్రీడా పోటీలను విజయవంతం చేయాలని స్థానిక కార్పొరేటర్ ముస్కమల్ల అరుణ కోరారు.

**బైక్ ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ**

హసన్‌పర్తి: ఏప్రిల్ 6న హనుమాన్ జయంతిని పురస్కరించుకుని నిర్వహించనున్న బైక్ ర్యాలీ పోస్టర్‌ను విశ్వహిందూ పరిషత్, భజరంగ్‌దళ్ సంయుక్త ఆధ్వర్యంలో ఎర్రగట్టు దేవస్థానంలో ఆవిష్కరించారు.

**బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ**

కాజీపేట: 62వ డివిజన్‌లోని విష్ణుపురి కాలనీలోని పలు బాధిత కుటుంబాలను కార్పొరేటర్ దాస్యం అభినవ్‌భాస్కర్ శనివారం పరామర్శించారు. ఇటీవల మృతి చెందిన కొక్కొండ రాజేశ్వరి, రోడ్డు ప్రమాదంలో గాయపడిన రిటైర్డ్ ఉద్యోగి పాక ఓంప్రకాష్‌ల ఇళ్ల వద్దకు కుటుంబ సభ్యులతో చర్చించారు.

**బీఆర్ఎస్ కార్యకర్తకు పరామర్శ**

ఎంజీఎం: అనారోగ్యానికి గురై ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బీఆర్ఎస్ కార్యకర్త చాగంటి రమేష్‌ను 60వ డివిజన్ కార్పొరేటర్ అభినవ్ భాస్కర్ శనివారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన ఆరోగ్య పరిస్థితి గురించి ఆర్ఎంఓ మురళిని వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**దేవతామూర్తులకు లక్ష పుష్పాభిషేకం**

కాజీపేట: కాజీపేట 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్‌లోని అభయాంజనేయస్వామి దేవాలయంలో సీతారామలక్ష్మణ సమేత ఆంజనేయస్వామికి లక్షపూలతో శనివారం ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు జాగర్లపూడి శ్రీనివాస శర్మ పర్యవేక్షణలో దేవతామూర్తులకు అర్చకులు పుష్పాభిషేకం జరిపించారు. కార్యక్రమంలో ఆలయ పాలకమండలి సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

**ఉమ్మడి జిల్లా కన్వీనర్‌గా అమీర్**

న్యూశాయంపేట: సమాచార హక్కు రక్షణ చట్టం ఉమ్మడి వరంగల్ జిల్లా మీడియా కన్వీనర్‌గా వరంగల్ నగరానికి చెందిన మహ్మద్ అమీర్ నియమితులయ్యారు. ఈమేరకు అమీర్‌కు ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు విద్యాసాగర్ నియామక పత్రం అందజేశారు.

**బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా యాదగిరి**

వరంగల్ చౌరస్తా: జాతీయ బీసీ సంక్షేమ సంఘం వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా బెంబిరి యాదగిరి నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు సంఘం నాయకులు నియామక పత్రం అందజేశారు.


# రంజాన్ మాసంలో ఆధ్యాత్మిక చింతన



విందులో పాల్గొన్న ఆర్‌ఎల్‌సీ, ప్రిన్సిపాల్

న్యూశాయంపేట: మహ్మద్ ప్రవక్త ప్రవచనాలకు అనుగుణంగా రంజాన్ మాసంలో ఆధ్యాత్మిక, సేవాగుణాలు అలవర్చుకోవడం, హృదయాల్లో దయాగుణం వెల్లివిరవడం అభినందనీయమని టిమ్రిస్ ఆర్‌ఎల్‌సీ శ్రీపాల అన్నారు. రంజాన్ ఉపవాసాల సందర్భంగా వరంగల్ దూపకుంట రోడ్డులోని వరంగల్ బాలికలు –2 మైనార్టీ గురుకులంలో ఆయిల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ బాధ్యులు మహ్మద్ మాజిద్, మహ్మద్ మసూద్, మహ్మద్ ముబీన్‌ల ఆధ్వర్యంలో శనివారం ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కంపెనీ బాధ్యులను సత్కరించారు. ప్రిన్సిపాల్ మాధవి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జక్కలొద్ది ప్రిన్సిపాల్ భిక్షపతి, కౌన్సిలర్ మోహియొద్దీన్ పాల్గొన్నారు.

# ఘనంగా షైన్ స్కూల్ వార్షికోత్సవం




మాట్లాడుతున్న చీఫ్‌విప్ వినయ్‌భాస్కర్

ఖిలా వరంగల్: షైన్ స్కూల్స్ ఆధ్వర్యంలో తరంగ్ –2023 పేరుతో షైన్ వార్షికోత్సవాన్ని హంటర్‌రోడ్డులోని ఆకుతోట కన్వెన్షన్ హాల్‌లో శనివారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ప్రభుత్వ చీఫ్‌విప్ దాస్యం వినయ్‌భాస్కర్ హాజరై కుడా చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించి ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దాలని సూచించారు. అనంతరం విద్యార్థులు ఆటపాటలతో ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో షైన్ విద్యాసంస్థల చైర్మన్ కుమార్‌యాదవ్, డైరెక్టర్ రాజేందర్‌కుమార్, రమేష్, ప్రిన్సిపాల్ సతీష్, ప్రగతిరెడ్డి, రాజ్‌కుమార్, విశాల్, సబిత, కవిత, రాజుగౌడ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# నాసిరకం రోడ్డు పనులు

● వారం రోజులకే ధ్వంసం



హసన్‌పర్తి: నాణ్యతకు తిలోదకాలు ఇస్తూ నిర్మించిన రోడ్డు వారం రోజులకే ధ్వంసమైంది. హసన్‌పర్తి మండలంలోని అన్నాసాగరం – చింతగట్టు, జయగిరి – హసన్‌పర్తి గ్రామాల మధ్య బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.80 కోట్లు విడుదలయ్యాయి. పది కిలోమీటర్ల మేర పనుల టెండర్‌ను ఓ మాజీ మంత్రి అనుచరుడు దక్కించుకున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఓవైపు పనులు కొనసాగుతుండగానే మరో వైపు నూతన రోడ్డు దెబ్బతింటోంది. అలాగే, హసన్‌పర్తి సెంటర్‌లో ఆరేళ్ల క్రితం పీటున్నర మందంతో సీసీ రోడ్డు నిర్మించారు. ఆ రోడ్డును ప్రస్తుతం తొలగించడంపై స్థానికంగా అభ్యంతరం వ్యక్తమవుతోంది. కాగా, రోడ్ల నిర్మాణాలపై వస్తున్న ఫిర్యాదులకు ఎమ్మెల్యే అరూరి రమేష్ స్పందించారు. సంబంధిత అధికారులు, కాంట్రాక్టర్‌పై ఆగ్రహం వ్యక్తం చేసినట్లు తెలిసింది.